ప్రజాశక్తి
గురువారం 10 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం



నేడు 'నియోజకవర్గాల పునర్విభజన'పై సెమినార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంలోని కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో 'నియోజకవర్గాల పునర్విభజన పూర్వాపరాలు-శాస్త్రీయ పద్ధతి' అంశంపై గురువారం సెమినార్ నిర్వహించనున్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించే సెమినార్‌లో ముఖ్య వక్తలుగా మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రెడ్డి తిరుపతిరావు, ప్రముఖ న్యాయవాది పి.వి.ఎస్ సీతారామయ్య పాల్గొనున్నారని నిర్వాహకులు తెలిపారు. సెమినార్‌కు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వంట గ్యాస్ నిరసన మంటలు

సిపిఎం ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై నిరసనాగ్రహం వ్యక్తమైంది. సిపిఎం ఆధ్వర్యాన జిల్లాలోని పలుచోట్ల బుధవారం చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. గ్యాస్ సిలిండర్లను మోస్తూ వినూత్న రీతిలో నిరసనలు చేపట్టారు. ఎచ్చెర్లలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి కూటమి ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు.



ఎచ్చెర్ల : నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గాయని, వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించి ఆ ఫలితాలను అందించాల్సి ఉందన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రు.50 పెంచడం దారుణమన్నారు. గతంలో రూ: 400 ఉండే సిలిండర్ ధర ప్రస్తుతం రూ: 880 పెరిగిందని, దీనివల్ల ఉజ్వల పథకం లబ్ధిదారులు, సాధారణ వినియోగదారులపై పెద్ద భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువుల ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పట్నుంచీ గ్యాస్ సిలిండర్ ధరలు 130.57 శాతం పెంచడంతో పాటు సబ్సిడీని కూడా తగ్గించుకుంటూ వచ్చిందని గుర్తుచేశారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తూ, జిల్లాలోని వినియోగదారులపై ఏడాదికి రూ.25.79 కోట్ల భారం మోపుతోందని విమర్శించారు. గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే, దేశీయంగా మోడీ ప్రభుత్వం ఎప్పటిలాగే తన ఖాజానాను నింపుకునే పనిలో ఉందని దుయ్యబట్టారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.రెండు చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకోవడంతో, తాజా పెంపుతో లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 అమల్లోకి రానుందని తెలిపారు. 2014 నుంచి 2016 మధ్య మోడీ ప్రభుత్వం ఇంధనాలపై తొమ్మిది సార్లు సుంకాన్ని పెంచిందని గుర్తుచేశారు. దీంతో కేంద్రానికి రూ.99 వేల కోట్ల ఆదాయం సమాకుర్చుకుందని చెప్పారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని, లేకుంటే ప్రజల మద్దతుతో పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, స్థానిక నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు, బి.రాము, టి.రామారావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర ప్రభుత్వం పేదలు వినియోగించే వంట గ్యాస్ ధరలను పెంచి మోయలేనంత ఆర్థిక భారాన్ని మోపిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి విమర్శించారు. వంట గ్యాస్, పెట్రో ధరల పెంపును వ్యతిరేకిస్తూ శ్రీకాకుళం నగరంలోని డే అండ్ నైట్ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, నాయకులు ఆర్.ప్రకాశరావు, గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎ.సత్యం తదితరులు పాల్గొన్నారు.

పలాస : కాశీబుగ్గలోని గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, నాయకులు ఎన్.గణపతి, కె.సుహాసిని, ఎన్.ఢిల్లేశ్వరి, తెప్పల అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి జెడ్‌పి రోడ్డులో ధర్నా చేపట్టారు. పెంచిన ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.షణ్ముఖరావు, నాయకులు కొల్లి ఎల్లయ్య, బి.వాసుదేవరావు, బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని పారిశ్రామికవాడ వద్ద నిరసన తెలిపారు. పెంచిన వంటగ్యాస్ ధరలను ఉపసంహరించుకోవాలని, లేకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొడ్డేపల్లి.జనార్ధనరావు బెండి సూర్యనారాయణ, బండి హేమసుందర్, బి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, బాలికల భద్రతకు తొలి ప్రాధాన్యం

- గంజాయి నియంత్రణకు కఠిన చర్యలు
- పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా పనిచేయాలి
- రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత


మాట్లాడుతున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మహిళలు, బాలికల భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, వారిపై అఘాయిత్యాలను పూర్తిస్థాయిలో అరికట్టాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. పోలీస్‌శాఖ ప్రతిష్ట పెంచేలా ప్రతి అధికారి సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలు, పోలీసు అధికారులతో బుధవారం సమీక్షించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించేందుకు దశల వారీగా పోలీసు శాఖకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పోలీసు వాహనాలు, ఫింగర్ ప్రింట్ పరికరాలు, సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాలను సమకూరుస్తామని చెప్పారు. శిక్షల శాతం పెంచేందుకు కేసులను మరింత లోతుగా దర్యాప్తు చేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి బృందాల ద్వారా సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణా తరగతులు నిర్వహించాలని, డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటు చేయించాలని సూచించారు. పురుష విద్యార్థులకు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టుల వద్ద నిరంతరం వాహన తనిఖీలు నిర్వహించి గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. విద్యాలయాలు, గృహ సముదాయాలు, గ్రామీణ ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయించాలని తద్వారా నేర నియంత్రణతో పాటు వాటిని సత్వరం ఛేధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. పోలీస్ స్టేషన్‌లకు వచ్చే మహిళా ఫిర్యాదుదారులపై సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారు సమస్యలను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.

జిల్లాలో ప్రాపర్టీ నేరాలు పెరిగినా, వాటి ఛేదన కూడా అంతే వేగంగా సాగుతోందన్నారు. ఇప్పటికి రూ.నాలుగు కోట్ల మేరకు కేసుల ప్రాపర్టీని ఛేదించి నిందితులను అరెస్టు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలో మహిళలు, బాలికలకు సంబంధించిన నేరాలు, పోక్సో, మాదకద్రవ్యాలు, గ్రేవ్ ప్రాపర్టీ కేసులు నమోదు, నేర నియంత్రణ చర్యలు, కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సిబ్బంది సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి వివరించారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ మహిళాలు, బాలికలు సంబంధించిన నేరాలు, గంజాయి నిర్మూలన, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ కేసులు నమోదు వంటి అంశాలతో ఎస్‌పిలతో ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది కష్టపడి పని చేస్తున్నారని చెప్పారు.

హోంమంత్రికి ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన హోంశాఖ మంత్రి అనిత తొలుత ఎస్‌పి కార్యాలయంలో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపినాథ్ జట్టి, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఎస్‌పిలు కెవి మహేశ్వర రెడ్డి, వకుల్ జిందల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎఎస్‌పి అంకిత సురాన పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన జానపద కళాకారులు చేసిన తప్పెటగుళ్లను తిలకించారు. సమావేశంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద,వివి అప్పారావు, అప్పారావు, శేషాద్రి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి పరామర్శ

శ్రీకాకుళం నగరంలో కేన్సర్‌తో బాధపడుతున్న లతశ్రీని హోంమంత్రి అనిత పరామర్శించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఆమె ఇంటికి వెళ్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. హోంమంత్రి అనితను కలవాలన్న లతశ్రీ కోరికపై స్పందించిన హోంమంత్రి, ఇటీవల ఆమెతో వీడియో కాల్‌లో మాట్లాడారు. త్వరలో ఇంటికి వచ్చి కలుస్తానని మాటిచ్చిన నేపథ్యంలో జిల్లా పర్యటనకు రావడంతో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి లతశ్రీని పరామర్శించి ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆరోగ్యం మెరుగు కోసం ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు.

పర్యాటకరంగ అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి


మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

పర్యాటక రంగానికి పరిశ్రమ హోదాను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో సంబంధిత రంగాన్ని జిల్లాలో అన్నివిధాలుగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో పర్యాటక శాఖ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. టెక్కలిలో పట్టు మహాదేవ్ కోనేరు, భావనపాడు బీచ్, కొత్తపేట కొండ, టెక్కలిలో కీ.శే కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు పేరిట నెలకొల్పిన పార్కు అభివృద్ధికి చర్యలు చేపడుతూ సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నక్షత్ర హోటల్స్ ఏర్పాటు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. గ్రీనరీ, చిన్నారులు ఆడుకునేందుకు పార్కు వంటివి సదుపాయాల ఏర్పాటుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అంతకుముందు ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను మంత్రికి విన్నవించుకున్నారు. సమావేశంలో ఇఇ రమణ, జెఇ మన్మథరావు, జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సికి ఆన్‌లైన్ శిక్షణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మెగా డిఎస్‌సి పరీక్షకు హాజరయ్యే బిసి అభ్యర్థులకు బిసి స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఇ.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఈనెల 11వ తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే వారు తప్పక టెట్ అర్హత సాధించి ఉండాలని స్పష్టం చేశారు. టెట్ మార్కుల ఆధారంగా శిక్షణకు ఎంపిక చేస్తారని తెలిపారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల బిసి స్టడీ సర్కిల్ కార్యాయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు పది, ఇంటర్మీడియట్, డిగ్రీ మార్కుల జాబితాలతో పాటు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, టెట్ మార్కుల జాబితా, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 7382975679, 9295653489 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పంచాయతీరాజ్ ఉద్యోగోన్నతులపై జిఒ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నో ఏళ్లుగా పంచాయతీరాజ్ వ్యవస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు రాక చేరిన చోటే ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చేదని, ఎట్టకేలకు బుదవారం ప్రభుత్వం జిఒ 35ను విడుదల చేసిందని పంచాయతీరాజ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు పిల్లా జగన్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిఒ వల్ల ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తున్న పంచాయతీ విస్తరణ అధికారులను క్యాడర్ డిప్యూటీ ఎంపిడిఒలుగా మార్పు చేశారని వివరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌కి చెందిన రెవెన్యూ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. రీ సర్వే, పిజిఆర్‌ఎస్, పౌర సేవలపై రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. గ్రామస్థాయిలో భూముల రీ సర్వే ప్రక్రియను పటిష్టంగా అమలు చేయాలని, దానికి సంబంధించిన అభ్యంతరాలను తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్‌ఎస్ దరఖాస్తులు ఎస్‌ఎల్‌ఎ గడువు దాటి పోకుండా పరిష్కరించాలన్నారు. వాటర్ ట్యాక్స్ వసూలుపై గ్రామస్థాయిలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఐవిఆర్‌ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, సేవల నాణ్యతను మెరుగుపర్చాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెద్ద మార్కెట్ తరలింపుపై అపోహలు వద్దు

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పెద్ద మార్కెట్‌లో వ్యాపారుల జాబితా తయారైతే ప్రణాళిక ప్రకారం నిర్మాణం చేయడానికి ముందుకెళ్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. పెద్ద మార్కెట్ పునర్నిర్మాణ పనుల కోసం ఈనెల 15వ తేదీ లోగా ఖాళీ చేయించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఇటీవల మార్కెట్‌లో పర్యటించిన సందర్భంగా అధికారులను ఆదేశించిడంపై వ్యాపారులంతా స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాబితా తయారైన తర్వాత అందులో ఉన్న వ్యాపారులందరికీ స్థలాల కేటాయింపుపై కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాతనే మార్కెట్‌ను తరలిస్తామన్నారు. మార్కెట్ తరలించేలోగా మూడు రకాల ప్లాన్‌లు తయారు చేయిస్తున్నామన్నారు. వీటిని మార్కెట్ వ్యాపారుల ముందు పెట్టి అందులో ఒక్క ప్లాన్‌కు అందరి సూచన మేరకు ఎంపిక చేస్తామన్నారు. కొనుగోలుదారులు, వినియోగదారులకు, వ్యాపారులకు అనుకూలంగా ఉండేలా మార్కెట్‌ను నిర్మాణం చేస్తున్నట్టు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం చేపడతామన్నారు. పెద్ద మార్కెట్‌లో వ్యాపారులంతా సమావేశమై మార్కెట్‌లో ఉన్న వ్యాపారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. దీన్ని వ్యాపారుల సమక్షంలో చదివి జాబితాలో చేర్చిన వారి పేర్లు చదవి ఫైనలైజ్ చేస్తామన్నారు. పైరవీలకు అవకాశం లేకుండా పారదర్శకంగా షాపులు కేటాయింపు ఉంటుందన్నారు. మార్కెట్ విషయంలో తాను ఇప్పటివరకు ఏమీ మాట్లాడలేదన్నారు. అపోహలు నమ్మి ఆందోళన చెందవద్దని వ్యాపారులకు సూచించారు. సమావేశంలో పెద్ద మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షులు కోరాడ హరిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అలల తాకిడికి బోటు, వలలు ధ్వంసం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి


ధ్వంసమైన ఇంజిన్ బోటు

బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల అలల తాకిడికి బోటు, వలలు ధ్వంసమైన ఘటన మండలంలోని గెద్దలపాడులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో మంగళవారం దండోరా వేయించారు. దీంతో శ్రీరంగం వీరాస్వామి, నుత్తు కామయ్య, తుంబల దాలయ్య, గారయ్య, ఎం.ధనుంజయరావు, ఎస్.కృష్ణారావుకు చెందిన ఇంజిన్ బోటు, గ్రామంలోని మత్స్యకారులు సుమారు వంద మీటర్ల సముద్రం లోపల లంగరు వేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి సముద్రంలో అలల ఉధృతి పెరగడంతో శ్రీరంగం వీరాస్వామికి చెందిన లంగరు వేసిన బోటు పూర్తిగా ధ్వంసమైంది. బుధవారం వేకువజామున మత్స్యకారులు లంగరు వేసిన బోటు చూస్తే కనిపించలేదు. దీంతో వారు బోటు యజమానితో పాటు మిగతా మత్స్యకారులకు విషయం తెలియజేశారు. అనంతరం సముద్రంలో వెతకగా పిట్టవానిపేట, గొలుగువానిపేటకు మధ్యన బోటు కనిపించింది. మత్స్యకారులు తాళ్ల సాయంతో ఒడ్డుకు లాగారు. అలల ఉధృతితో బోటు పూర్తిగా ధ్వంసమైంది. బోటులో ఉన్న వలలు కొట్టుకుపోయాయి. విషయం తెలుసుకున్న మత్స్యశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బోటు, వలలు సుమారు రూ.15 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు మత్స్యశాఖ అధికారులు అంచనా వేశారు. దీనిపై మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు బాధిత మత్స్యకారులు, మత్స్యకార సంఘం నాయకులు పిట్ట రాజులు, శ్రీరంగం రాజులు, శ్రీరంగం ఎర్రయ్య వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్) ఆధ్వర్యాన నిరుద్యోగ ఎస్‌సి యువతీ యువకులకు ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి శిక్షణకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదివి 18 ఏళ్లు నిండిన యువకులు అర్హులని, దరఖాస్తు చేసుకున్న వారికి రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణార్థులకు మధ్యాహ్న భోజనం, శిక్షణ అనంతరం పలు సంస్థల్లో ఉద్యోగ కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893227705 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

IN THE HONOURBLE COURT Of THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
IA.262/2024 in OS.85/2018

Between:-
గరుకు ఉరఫ్ గరుగు సరోజినీ ......పిటిషనర్
And:- **చాట్లపల్లి సత్యవతి మరియు ఇతరులు** .....రెస్పాండెంట్స్

నోటీస్

To,
R-2: చాట్లపల్లి శ్రీను, S/o లేటు క్రిష్ణ, వ్యాపారం నివాసం,C/o చాట్లపల్లి సత్యవతి ఇంటి నంబరు 162 హట్కో కాలనీ, శ్రీకాకుళం టౌన్, శ్రీకాకుళం జిల్లా.

పై పిటిషనర్ మీ పైన నంబరు గల పిటిషన్ పైకోర్టులో వేసినారు సదరు పిటిషన్ లో మీరు రెండవ పార్టీగా ఉన్నారు మీ హాజరు నిమిత్తము **తేదీ 29-04-2025 న ఉదయం 10:30 గం॥ వాయిదా అయి ఉన్నది** పైన తేదీన పై గంటలకు మీరు ప్రత్యక్షంగా గాని వకీల్ ద్వారా గాని హాజరై మీ వాదన తెలియపరచుకొనవలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం జరుగును.

// By order of the Honourable court //

పేరూరి నాగేశ్వరరావు
పిటిషనర్ తరపున న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9848950706.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు

పట్టణ ప్రణాళిక ప్రాంతీయ డైరెక్టర్ పి.నాయుడు

ప్రజాశక్తి - పలాస


సమావేశంలో మాట్లాడుతున్న నాయుడు

మున్సిపాల్టీల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని, ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని విశాఖపట్నం పట్టణ ప్రణాళిక ప్రాంతీయ డైరెక్టర్ పి.నాయుడు హెచ్చరించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాల్టీల్లో అక్రమ నిర్మాణాలకు తావివ్వకుండా త్వరితగతిన ప్లాన్ అప్రూవల్ ఇచ్చేలా పనిచేయాలని ఆదేశించారు. ప్లాన్ అప్రూవల్ కోసం వచ్చే వారు రోజుల తరబడి తిరగకుండా చూడాలని, దరఖాస్తు చేసుకున్న తర్వాత పోస్ట్ వెరిఫికేషన్ ఉండదనే విషయాన్ని అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. 16 సచివాలయాల పరిధిలో ప్లాన్ అప్రూవల్, పెండింగ్‌లో ఉన్న వాటిపై సమీక్షించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఎడిటిపి శ్రావణి, డిటిసిపి కృష్ణ, టిపిఒ వరప్రసాద్, టిపిఎ సంతోష్, పట్టణ సర్వేయరు చంద్రశేఖరరావు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, లైసెన్స్‌డ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్షకు హాల్ టిక్కెట్లు విడుదల

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

2025-26 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో అంబేద్కర్ గురుకులాల్లో చేరేందుకు ఈనెల 13వ తేదీన నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు హాల్ టిక్కెట్లు విడుదల చేసినట్లు గురుకులాల సమన్వయాధికారి ఎన్.బాలాజీ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మూడు బాలురు, ఆరు బాలికల అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో చేరేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఐదో తరగతిలో ప్రవేశానికి 640 సీట్లకు గానూ 1216 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు 800 సీట్లకు గానూ 1318 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. విద్యార్థులు వారికి హాల్ టిక్కెట్‌లో కేటాయించిన పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని పేర్కొన్నారు. https://apbragcet.apcfss.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకునే సమయంలో ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తినా దరఖాస్తులో పొందుపరిచిన కేంద్రానికి ముందుగా హాజరై పరిశీలించుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్, బ్లూ గానీ బ్లాక్ బాల్ పాయింట్ పెన్ గానీ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9701736862, 9000314209 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న డప్పు కళాకారులు

డప్పు కళాకారుల ర్యాలీ

పలాస : డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని డప్పు కళాకారుల సంఘం (కెవిపిఎస్) నాయకులు తోట సిమ్మయ్య, రుంకు రామారావు, రోకళ్ల తిరుపతిలు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం నుంచి శ్రీనివాస కూడలి వరకు బుధవారం డప్పులతో ర్యాలీ చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మంకినమ్మ ఆలయం ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక పోరాటాలు ఫలితంగా ప్రభుత్వాలు పింఛన్లు, కార్డులు మంజూరు చేశాయని అన్నారు. కానీ, ఇంకా అనేకమంది అర్హులు ఉన్నారని తెలిపారు. సంప్రదాయ కళలకు ప్రోత్సాహం కల్పించాలంటే డప్పు కళాకారులను ఆదుకొని ముందుకు తీసుకురావాలని కోరారు. కళాకారులకు గజ్జెలు, డప్పులు, డ్రమ్ములు, సన్నాయి వంటి వాయిధ్యాలు అందజేయాలని విన్నవించారు. సమస్యలు పరిష్కారానికి కళాకారులంతా ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. సమస్యలపై ఈ నెల 21న ఆర్‌డిఒకు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు నాయకులు ఎన్.గణపతి పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జోగి జనార్ధన, ఎ.నాగేశ్వరావు, సిహెచ్.చరణ్, టి.భగీరథి, జి.హరికృష్ణ, పి.శివరాం, జి.దాసు, ఆర్.హరికృష్ణ, కె.పాపారావు, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్థితిలో రైల్వే పనులు

ప్రజాశక్తి– ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస) రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులు అత్యంత ప్రమాదకరమైన స్థితిలో ఉండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమృత్ భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధి నిర్మాణ పనుల్లో భాగంగా గత కొంతకాలం నుంచి నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ ఎటువంటి నిబంధనలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆగి ఉన్న రైళ్ల భోగీల మధ్య కూలీలు నిర్మాణ పనుల సామగ్రి మోయడం ఇక్కడ నిత్య కృత్యంగా మారింది. రెండు భోగీల మధ్య కాంక్రీట్ ఇసుక తలపై మోస్తున్న కూలీలు పనినిమగ్న సమయంలో రైలు కదిలితే ప్రాణాలు హరి అనడం ఖాయమని చర్చించుకుంటున్నారు.



గూడ్స్ రైలు బోగీల మధ్య నుంచి ఇసుకను మోస్తున్న భవన నిర్మాణ కార్మికులు

రైల్వేస్టేషన్ మధ్య భాగంలో ఏర్పాటు చేస్తున్న ఎస్కేటర్ బ్రిడ్జి నిర్మాణంలో కూడా పరిసర ప్రాంతంలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా భారీ ఇనుప కడ్డీలు ఏర్పాటు చేస్తున్న కూలీలు దృశ్యాల సర్కస్‌ని తలపిస్తున్నాయని నగర వాసుల ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులు రాకపోకలు సాగించే సమయంలో క్రేన్ సహాయంతో పైకి లేపుతున్న ఇనుప కడ్డీలు వైపు చూస్తూ భయాందోళనలతో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా రైల్వే ఉన్నతాధికారులు పనులను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

శిథిలావస్థలో వంతెన

ప్రజాశక్తి– వజ్రపుకొత్తూరు

మండలంలోని చినవంక–పల్లిసారధి–కాశీబుగ్గ రహదారిలో రిట్టపాడు సమీపంలోని వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన బ్రిటిష్ కాలం నాటిదని స్థానికులు చెబుతున్నారు. ఈ వంతెనపై రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు భయపడుతున్నారు. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందో అని ఆందోళన చెందుతున్నారు. వంతెన రక్షణ గోడలు బీటలు ఇచ్చాయి. వంతెన శ్లాబ్ పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. కాశీబుగ్గ నుంచి మండల కేంద్రానికి చేరుకోడానికి దగ్గర దారిగా ఉండడంతో ఈ రోడ్డులో రద్దీ అధికంగా ఉంటుంది. సుమారు 50 గ్రామాలకు చెందిన ప్రజలకు ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. ఈ వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని ఉద్దానం ప్రాంతీయులు కోరుతున్నారు. అధికారుల నుంచి కనీస స్పందన లేదని పేర్కొంటున్నారు. ఈ వంతెన కూలిపోతే 50 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోతాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి శిథిల వంతెన స్థానంలో కొత్తది నిర్మించాలని కోరుతున్నారు.


శిథిలావస్థకు చేరుకున్న వంతెన


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఒడిశా అధికారులు

ఆంధ్రా స్వయంశక్తి సంఘాల అభివృద్ధి భేష్

ఒడిశా అధికారుల అధ్యయనం

లావేరు: మండలంలోని పలు స్వయంశక్తి సంఘాలు పనితీరు, సభ్యుల అభివృద్ధి బాగుందని ఒడిశా రాష్ట్రం అదనపు సిఇఒ భవిత మహోపాత్రో, అధికారుల బృందం తెలిపారు. మండలంలోని మూరపాక, తామడ గ్రామాల్లో స్వయం శక్తి సంఘాల ఆర్థిక పురోగతి, రుణాల ద్వారా వ్యాపారం చేస్తూ అభివృద్ధి చెందుతున్న మాడుగుల ఆదిలక్ష్మి పిఎంఎఫ్‌ఎంఇ ద్వారా రుణం తీసుకొని కొబ్బరి నూనె వ్యాపారం చేస్తున్న తీరును బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఏ విధంగా ఈ కార్యక్రమలు నిర్వహిస్తున్నారు... లాభాలు ఎలా వస్తున్నాయి.. అనే విషయాలు తెలుసుకున్నారు. గ్రామ సంఘాల పనితీరుపై మూరపాకలో సంఘం తీరుపై అడిగి తెలుసుకున్నారు అనంతరం లావేరులో మండల మహిళ సమాఖ్య పనితీరు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రాలో స్వయంశక్తి సంఘాలు పనితీరు బాగుందని అన్నారు. సభ్యుల ఆదాయ వనరులు బాగున్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారులు వీరశేఖర్‌మూర్తి, మోహనరావు, నారాయణరావు, నాగలక్ష్మి, మల్లేశ్వరరావు, ధనలక్ష్మి, ఎసి రవికుమార్, ఎపిఎం సబ్బాయ్యనాయుడు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి– పోలాకి

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండలంలోని కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పెద్దఎత్తున ప్రజలు వినతులు అందజేశారు. తాగునీటి సమస్యలు, రెవెన్యూ సమస్యలు, రేషన్ కార్డులు, పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు, మౌలిక సదుపాయాలు వంటి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎం.వెంకట అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : వంశధార నది ఒడ్డునే ఉన్న అనేక గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని, నైర, పొన్నాం, బట్టేరు ప్రాంతాల్లో ఉన్న గ్రోయిన్లు ఉపయోగంలోకి లేకపోవడంతో ప్రధాన కాలువ ద్వారా బూరవెల్లి నుంచి వమ్మరవెల్లి వరకు ఉన్న అనేక గ్రామాల రైతులకు సాగునీరు అందడం లేదని రైతులు అన్నారు. ఈ మేరకు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం సిలగాంలో ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి పాల్గొన్నారు. కార్యక్రమంలో గార టిడిపి నాయకులు గొండు వెంకటరమణ మూర్తి, కొంక్యాన ఆదినారాయణ, బడగల వెంకటప్పారావు పాల్గొన్నారు.


పోలాకి : వినతిపత్రాలను స్వీకరించిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

ఆమదాలవలస : ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ పేరుకట్ల విశ్వప్రసాద్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని ప్రజల సమస్యలపై ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు, రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలపై వందకు పైగా దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు నూక రాజు, గొండు రమణ, నాగళ్ల మురళీధర్ యాదవ్ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

కార్యదర్శులను బాధ్యులను చేయడం తగదు

పొందూరు: ప్రభుత్వం చేపడుతున్న అన్ని సర్వేలకు సచివాలయ కార్యదర్శులకు మాత్రమే బాధ్యతలను అప్పగించడం తగదని మండల కార్యదర్శుల సంఘం సభ్యులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ మీసాల మన్మథరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యదర్శులు వారి నిత్య విధులు, సర్వేలు చేయడం కష్టంగా ఉందని తెలిపారు. సర్వేలు బాధ్యత ఒక్క కార్యదర్శిలకే కాకుండా సచివాలయంలోని సిబ్బంది అందరికి అప్పగించాలని కోరారు. ఇందులో కార్యదర్శులు మోహన్‌బాబు, జగదీష్, రాజీవ్, శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

'కుప్పిలి'కి రాష్ట్రస్థాయి బహుమతి

ఆమదాలవలస : పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని చివటం సంగీత సాహిత్య కళా వేదిక రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కవితల పోటీల్లో కవి రచయిత కుప్పిలి వెంకటరాజారావు రచించిన 'సదా పదిలం' కవితకు ద్వితీయ బహుమతి లభించింది. ఈ మేరకు కవితా పోటీల నిర్వాహకురాలు గుండాల గీతా మహాలక్ష్మి సమాచారం పంపారు. 126 మంది కవితలు పంపగా కుప్పిలి వెంకట రాజారావుకు ద్వితీయ బహుమతి లభించింది. రాజారావుకు బహుమతి లభించడంపై కవులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 11న తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ గుర్తింపు పొందిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టిఒఎంసిఒఎం) జాబ్‌మేళాను నిర్వహిస్తుందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్ వంటి దేశాల ప్రభుత్వ, ప్రయివేటు సంస్థలతో ఈ సంస్థ భాగస్వామ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. హెల్త్‌కేర్, నాన్‌హెల్త్‌కేర్ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంస్థ కృషి చేస్తుందన్నారు. సౌదీ అరేబియా, కతార్, యుకె, కెనడా, జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, యుఎస్ ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు ఆరోగ్య రంగంలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోడానికి అర్హులన్నారు. ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమో, బిటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జపాన్, జర్మనీ, ఫిజి, గ్రీస్‌లో ఆరోగ్యేతర రంగాల్లో ఉద్యోగాలు చేసేందుకు అర్హులని వివరించారు. 40 ఏళ్ళ వయసున్న ఆసక్తిగల అనుభవం ఉన్న అనుభవం లేని అభ్యర్థులు సైతం ఈ మేళాలో పాల్గొని ధ్రువపత్రాలు, బయోడేటాతో హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8466096181, 9676339690 నంబర్లను సంప్రదించాలన్నారు సూచించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలోని 33/11 కెవి ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కణుగులవలస ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో ఈ నెల 11న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు కణుగులవలస, వెంగళరావు, కాలనీ గేటు ప్రాంతం పాత ఆమదాలవలస టి.ఎస్.ఆర్.కాలేజీ, రావికంటిపేట, కుద్దిరాం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

పాతపట్నం: ఈ నెల 11న ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు పాతపట్నం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గోపాలపురం, చంగుడి, సరాలి, తిడ్డిమి, రంకిని, సూర్యనారాయణపురం, దాసుపురం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫోన్లకు పిల్లలను దూరంగా ఉంచాలి


విద్యార్థులతో డాక్టర్ సింధూర

ప్రజాశక్తి– అరసవల్లి

పిల్లలు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని లయన్స్‌క్లబ్ సెంట్రల్ కార్యదర్శి డాక్టర్ పైడి సిందూరు అన్నారు. నగరంలోని చిన్నమండల వీధిలోని రవీంద్రభారతీ పాఠశాలలో ఘనంగా కిడ్స్ కాన్వొకేషన్ వేడుక మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, వారి ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా కృషి చేయాలని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా వారిలోని ఆత్మవిశ్వాసం పెరిగి మంచి ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా పిల్లలకు చిన్ననాటి నుంచే సెల్‌ఫోన్లకు అలవాటు చేస్తున్నారని, అది హానికరమని పేర్కొన్నారు. పిల్లలకు అక్క, చెల్లి, అన్న, తమ్ముళ్లతో ఇంట్లోనే ఆడించాలన్నారు. ప్రిన్సిపాల్ ఘోర చాంద్ పాల్కా మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మక శక్తి సామర్థ్యాలు వెలికి తీయడానికి తోడ్పడే విధంగా ఈ విద్యా విధానం అమలు చేస్తున్నామని అన్నారు. అనంతరం పిల్లలకు ప్రశంసాపత్రాలు, బంగారు పతకాలను అందజేశారు. అలాంగే సిందూరుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమములో నార్త్ ఆంధ్రా జోనల్ ఇన్‌ఛార్జి వెంకటేష్, సిజిఎం వసంత, జిఎం కె.రమ్య, డివిజనల్ ఇన్‌ఛార్జి రమేష్ పాల్గొన్నారు.

రీ సర్వేను వినియోగించుకోవాలి

ఆర్‌డిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి– పాతపట్నం

ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి సూచించారు. మండలంలోని గంధం సరియా, గురండి గ్రామాల్లో రీ సర్వేపై బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు రైతుల సమక్షంలో భూముల సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. గురండిలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ కిరణ్‌కుమార్, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా సరిహద్దులు

కవిటి: సమగ్ర రీ సర్వేలో గ్రామాలు, పంచాయతీల సరిహద్దులు సక్రమంగా ఉండాలని తహశీల్దార్ మురళీమోహన్ అన్నారు. మండలంలోని డి.జి.పుట్టుగ పంచాయతీలో బుధవారం సమగ్ర రీ సర్వే ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం డి.జి.పుట్టుగ, భైరిపురం, కాపాసుకుద్ది గ్రామాల ఉమ్మడి సరిహద్దులు సర్వే చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర భూ రీ సర్వే ఫేజ్–2లో భాగంగా ముందుగా డి.జి.పుట్టుగ పంచాయతీ సరిహద్దులు సర్వే చేస్తున్నట్టు తెలిపారు. దీనిద్వారా ఎవరికీ ఇబ్బందులు లేకుండా సర్వే సజావుగా సాగుతుందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ రీ సర్వే రైతులు వినియోగించుకుని రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణమూర్తి, మండల సర్వేయర్ మల్లికార్జున్ పాణిగ్రాహి, విఆర్‌ఒలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.


పాతపట్నం : ర్యాలీలో పాల్గొన్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి


పింఛను పత్రం అందజేస్తున్న అందజేస్తున్న ఇఎస్ఐ మేనేజర్ శ్రీప్రజ్ఞ

ఇఎస్ఐ పింఛను అందజేత

శ్రీకాకుళం : రణస్థలం మండలం పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీలో కాంట్రాక్టు కార్మికునిగా పనిచేసిన పూడి చిన్నంనాయుడు విధుల్లో భాగంగా కొద్ది రోజులుగా మృతి చెందారు. దీంతో మృతుడి తల్లిదండ్రులకు నెలావారీ పింఛను మంజూరైంది. నగరంలోని ఇఎస్ఐ కార్యాలయంలో మేనేజర్ ఎస్.శ్రీప్రజ్ఞ, డాక్టర్ బొడ్డేపల్లి రమేష్ బుధవారం దీనికి సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ఎవరైనా ఇఎస్ఐ బీమాదారులు, వృత్తి రీత్యా ప్రమాదానికి గురైతే మృతి చెందితే... మృతుని కుటుం బ సభ్యులకు ఆశ్రిత ప్రయోజనం కింద ప్రతినెలా పింఛను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆర్మ్‌స్ట్రాంగ్ కాంట్రాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల రక్షణపై అవగాహన

ప్రజాశక్తి– ఇచ్ఛాపురం

మండలంలోని రత్తకన్నలో డిప్యూటీ ఆర్ఒ ఐ.రాము వన్యప్రాణుల రక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న రెవెన్యూ కొండ (పీర్లకొండ) నుంచి తాగునీరు, ఆహారం కోసం జనావాసాల్లోనికి చుక్కల దుప్పిలు వస్తుంటాయని అన్నారు. ప్రజలు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందజేయాలని కోరారు. కుక్కల బారి నుండి రక్షించాలన్నారు. బుధవారం జనావాసాల్లోకి వచ్చిన జింకను స్థానికుల సహకారంతో పట్టుకుని సురక్షితంగా విడిచిపెట్టారు. కార్యక్రమంలో భానుమూర్తి, వెంకటేష్, లక్ష్మణమూర్తి, సురేష్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

గర్భిణులకు టీకాలు

ప్రజాశక్తి– రణస్థలం

పోషన్ పక్వాడాలో భాగంగా ఐసిడిఎస్ సిడిఇఒ సిహెచ్.ఝాన్సీ ఆధ్వర్యాన మండలంలోని కొవ్వాడ మత్స్యలేశం సచివాలయం పరిధిలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. విజయనగరం మహారాజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కాలేజీ సహకారంతో గర్భిణులకు, బాలింతలకు, 0–6 సంవత్సరాల వయసు గల పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి సురాడ రాముడు, సర్పంచ్ అల్లిపల్లి అప్పన్న, నిమ్స్ మేనేజర్ కృష్ణకాంత్, సెక్టార్ సూపర్‌వైజర్ టి.మంగమ్మ, సచివాలయం సెక్రెటరీ జీవన్ ఎం.ఎస్.కె.సంతోషి పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 260 అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో గర్భిణులకు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బి.సుజాత, ఎస్.నీలవేణి, జె.లక్ష్మి, పి.పల్లవి, పి.పుష్పలత, జి.కృష్ణవేణి పాల్గొన్నారు.

చింతాడ రవి పరామర్శ

పొందూరు: పొందూరులో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పట్టణంలోని విశ్రాంత డిఎంహెచ్ఒ సనపల తిరుపతిరావు, ఉత్తరాంధ్ర ఎరుకుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గొర్లె సూర్యారావుల కుటుంబాలను పరామర్శించారు. ఇందులో బాడాన సునీల్, గుడ్ల మోహన్, కోరుకొండ సాయికుమార్, రమణమ్మ, రామారావు ఉన్నారు.


పరామర్శిస్తున్న చింతాడ రవి

ఉద్దానంకే వన్నె తెచ్చారు : విప్


సన్మానిస్తున్న కుసుంపురం గ్రామస్తులు

ప్రజాశక్తి– కవిటి

సంగీత ప్రపంచంలో అద్భుతాలు సష్టిస్తూ, మునివేళ్లపై మృదంగ విన్యాసాలు పలికిస్తూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉగాది పురస్కారం తీసుకున్న బొంతలకోటి సత్య వరప్రసాద్ ఉద్దానం ప్రాంతానికే వన్నెతెచ్చారాని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కుసుంపురం గ్రామస్తులు, మాతృమూర్తి యువజన సంఘం సభ్యులు, గ్రామ యువత సత్య వరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. సత్యవరప్రసాద్ భవిష్యత్‌లో సంగీత ప్రపంచంలో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని మరిన్ని అవార్డులు, రివార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

ఉద్యోగోన్నతుల కల్పనకు వినతి

పలాస : అర్హులైన విఆర్‌ఎలకు విఆర్‌ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, జిల్లా కార్యదర్శి కె.రమణమూర్తి డిమాండ్ చేశారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఎఒ ప్రకాశరావును కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫే స్కేల్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. నామిని విఆర్‌ఎలను రెగ్యులర్ విఆర్‌ఎలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సిహెచ్.లక్ష్మణరావు, కార్యదర్శి బి.తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు సిహెచ్.సింహాచలం, వెంకటరావు, భైరాగి, భానుకుమారి, రేణుక, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

వస్త్ర వ్యాపారి ఆత్మహత్య!

ప్రజాశక్తి– పొందూరు

పొందూరు పట్టణానికి చెందిన వ్యాపారి కిషోర్‌కుమార్ (51) ధర్మవరం వద్ద ఉన్న నేలబావిలో అనుమానా స్పదస్థితిలో మృతి చెందారు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం రాత్రి ధర్మపురంలో డబ్బులు బాకీ ఉన్నారని, వెళ్తానని చెప్పి వెళ్లారు. ఎప్పటికీ రాకపోవడంతో ఆయనకు ఫోన్ చేయగా, ఇంట్లోనే సెల్‌ఫోన్‌ను వదిలివేసినట్లు గుర్తించామని తెలిపారు. దీంతో రాత్రి చాలా సమయం వేచి చూసి బంధువులు, స్నేహితులు వద్ద వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. బుధవారం ఉదయం నేలబావిలో మృతదేహం తేలుతూ ఉన్నట్లు స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి పరిశీలించడంతో ఆ మృతదేహం కిషోర్‌కుమార్‌దిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీనిపై మృతిని భార్య అనసూయ తన భర్త ధర్మపురం డబ్బులు బాకీకి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో బహిర్భూమికి వెళ్లి కాలు జారడంతో నేలబావిలో పడి మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కిషోర్‌కుమార్ (ఫైల్)

పొందూరు పట్టణంలో దశాబ్దాలు కాలంగా కుటుంబ సభ్యులు హోల్‌సేల్ వస్త్ర వ్యాపారాం చేస్తున్నారు. తన వ్యాపారాన్ని అభివృద్ధి చేయడంలో ఒడిదుడికులకు లోనై ఇటీవల పలువురు వద్ద పెద్ద ఎత్తున అప్పులు చేసినట్లు సమాచారం. దీంతో ఇటీవల అప్పులు చెల్లించాలంటూ ఒత్తి చేశారు. బ్యాంకు రుణాలూ ఉండడంతో కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురి అవుతున్నట్లుగా పలువురి వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. ఇటీవల అప్పులు వాళు ఒత్తిడి చేయడంతో రెండు నెలల్లో మొత్తం చెల్లింపులు చేస్తానంటూ హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఈ తరుణంలో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు.

పట్టణంలో ఎంతో సుపరచితుడైన కిషోర్ కుమార్ మృతితో విషాదచాయలు అలముకున్నాయి. ఈయన మృతిచెందిన విషయం తెలిసి బంధువులు, స్నేహితులు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులును ఓదార్చుతూ కన్నీరుమున్నీరయ్యారు. మృతునికి కుమారుడు శ్రీనిత్, కుమార్తె శ్రీయలు ఉన్నారు.



బాలిక బలవన్మరణం

కవిటి: మండలంలోని కె.కపాసుకుద్దికు చెందిన సిందిరి అపూర్వ (13) మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రవివర్మ అందించిన సమాచారం మేరకు అనారోగ్య కారణాల అపూర్వ గత కొంత కాలంగా మనస్తాపం చెందుతోంది. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కుటుంబ సభ్యులు తోటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇంటింటికి వచ్చి చూడగా అప్పటికే మృత్యువాత పడింది. మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేశారు. అపూర్వ తల్లి హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అపూర్వ మృతదేహం

వృద్ధుడు ఆత్మహత్య

మెళియాపుట్టి: మండలంలోని జర్రిభద్రకు చెందిన దుంపల సూర్యనారాయణ (72) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వృద్ధుడు మానసిక ఆవేదనతో గ్రామంలో సమీపంలోని ఆంజనేయ ఆలయం సమీపం పొలం గట్టుపై మంగళవారం సాయంత్రం గులుకుల తీసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు వైద్యం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ రాత్రి పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. మృతుడు కుమారుడు అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి భార్య గతంలో మృతి చెందింది. మృతుడికి ఐదురురు కుమారులు ఉన్నారు.


సూర్యనారాయణ మృతదేహం

రైలు ప్రమాదంలో యువకుడు మృతి

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం–తిలారు రైల్వే స్టేషన్ మధ్యలో బుధవారం సంభవించిన రైలు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడు వయసు 30 ఉంటుంది. గల్లు షర్టు, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి చామనిఛాయ రంగు కలిగి ఉన్నాడు. పలాస జిఆర్‌పి హెచ్‌సి డి.హరినాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలకు 8985021143 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.


గుర్తు తెలియని మృతదేహం

బంగారం చోరీ

సోంపేట : మండలంలోని కొర్లాం సమీపంలో హుకుంపేట కాలనీ వద్ద మంగళవారం రాత్రి బంగారు దమయంతిపై దాడి చేసి బంగారం చోరీ చేశారు. ఈ మేరకు బారువ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణకొర్లాంకు చెందిన దమయంతి పాలు విక్రయించిన అనంతరం తన స్వగ్రామానికి వెళ్తుంది. హుకుంపేట కాలనీ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి తలపై బలంగా దాడి చేశాడు. కింద పడిన దమయంతి మెడలో నుంచి, చెవిలో నుంచి బంగారం దొంగలించి పరారయ్యాడు. ఆమె కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సోంపేట సిఐ మంగరాజు, బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపట్నుంచి ఆత్మగౌరవ దినాలు

శ్రీకాకుళం అర్బన్: దేశ వ్యాప్తంగా దళితులు, పీడిత ప్రజల హక్కులను కాలరాస్తూ ఆదానీ, అంబానీలకు బిజెపి ప్రభుత్వం దోచి పెడుతోందని, ఇందుకు నిరసనగా ఈనెల 11న పూలే జయంతి, 14న అంబేడ్కర్ జయంతి రోజున ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటించాలని కులనిర్మూలనా పోరాట సమితి జిల్లా సహాయక కార్యదర్శి రాకోటి రాంబాబు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం మండలం చింతాడలో సమితి ఆధ్వర్యాన బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళితులు, అట్టడుగున ఉన్న ప్రజలకు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులను కాలరాస్తున్నారని, ప్రజలు జీవించే హక్కును హరిస్తున్నారని ఆరోపించారు. పోరాట దినాల్లో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. సంఘం నాయకులు దుప్పాడ రాజు, ముచ్చ జగన్, ముక్కురమణ, మల్లేసు, రామయ్య, తోట గణేష్, రాగోలు అర్జునరావు, తోట రామకృష్ణ, చలమయ్య, నీలమ్మ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

వికలాంగునికి కృత్రిమ అవయవం అందజేత


కృత్రిమ అవయవాన్ని అందిస్తున్న జగన్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిస్సహాయ స్థితిలో కాలు లేక గత కొంత కాలంగా అవస్థలు పడుతున్న అరసవల్లికి చెందిన పట్టా సత్యంకు బుధవారం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు కృత్రిమ అవయవాన్ని అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి సభ్యురాలు కె.ఉషారాణి ఆర్థికసాయంతో ఈ పరికరాన్ని అందజేశారు. జిల్లాలో ఎవరికి కృత్రిమ అవయవం కావాలన్నా అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్టు ఉషారాణి తెలిపారు. ఉచితంగా కృత్రిమ అవయవాలను విజయనగరం గురుదేవ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా అందిస్తున్నామని తెలిపారు. అవయవాలు అవసరమని భావిస్తే కళ్లేపల్లి ఉషారాణి 8332836356, ఉమాశంకర్ 97016 98408 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నాటుసారా నిర్మూలనకు చర్యలు

కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు

ప్రజాశక్తి- పలాస

నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కాశీబుగ్గ ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు అన్నారు. మండలంలోని శాసనంలో 2.0 నవోదయ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాటుసారా నిర్మూలనపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా విక్రయించిన, తయారు చేసిన చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నాటుసారా సేవించడం ద్వారా ఆరోగ్యం పాడవుతుందన్నారు. మత్తు పదార్థాలు, గంజాయి, నాటుసారాకు దూరంగా ఉండాలన్నారు. గతంలో ఈ ప్రాంతంలో నాటుసారా విక్రయిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. కార్యక్రమంలో డిటి లక్ష్మీనారాయణ, ఎక్సైజ్ ఎస్సై షేక్ సైదాబి, కూటమి నాయకులు డల్లి ప్రసాదరావు, కుప్పిలి కామరాజు, డల్లి జయరాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు

తప్పుడు పొజిషన్ ధ్రువపత్రంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లి పరిధిలోని సర్వే నంబరు 33-2పిపై మంజూరు చేసిన తప్పుడు పొజిషన్ ధ్రువపత్రంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఎంపిటిసి మాజీ సభ్యులు జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్థలంపై యతిరాజుల అప్పన్న, చింతాడ సీతామహాలక్ష్మిల మధ్య వివాదం నడుస్తోందని అన్నారు. 2020 మార్చిలో చింతాడ మహాలక్ష్మి పేరున పొజిషన్ ధ్రువపత్రం మంజూరైందని తెలిపారు. ఈ పొజిషన్ ధ్రువపత్రంపై యతిరాజుల అప్పన్న పొందూరు తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయగా, రికార్డుల్లో జారీ చేసినట్లు నమోదు కాలేదని అన్నారు. ఈ రేఖా సంఖ్యతో కోవిడ్ డ్యూటీ ప్రొసీడింగ్ ఇచ్చినట్లు నమోదై ఉన్నట్లు తహశీల్దార్ కార్యాలయం సమాచారం ఇచ్చిందన్నారు. మంజూరైన ధ్రువపత్రం తప్పు అని తేలిందన్నారు. ఈ తప్పుడు పొజిషన్‌తో నిర్మాణం చేపట్టిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఈ నెల 8నుంచి 22 వరకు నిర్వహిస్తున్న పౌష్టికాహార పక్షత్సవాల్లో భాగంగా నగరంలోని దమ్మలవీధిలో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాలింతలకు, గర్భవతులకు పౌష్టి కామారం ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో గూనపాలెం సెక్టారు సూపర్ వైజరు యోగీశ్వరి పాల్గొన్నారు. సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ కార్యదర్శి పద్మజ పాల్గొని రెండేళ్ల లోపు పిల్లల పర్యవేక్షణపై పలు సూచనలు చేశారు. వెయ్యి రోజులు జాగ్రత్తలపై గర్భిణులకు, బాలింతలకు వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పార్వతి, జ్యోతి, సహాయకులు శారద, శశి పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ ఉద్యోగులు

పోలీసుల ఆరోగ్యంపై శ్రద్ధ

శ్రీకాకుళం అర్బన్ : పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విజయదుర్గ ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ కోరారు. చేబోలు రామకుమార్, సుకన్య దంపతుల ఆర్థిక సాయంతో పోలీసుల సౌకర్యార్థం నగరంలోని రామలక్ష్మణ జంక్షన్, డే అండ్ నైట్ కూడలి, తహశీల్దార్ కార్యాలయం తదితర ఆరు ప్రధాన కూడళ్లలో తాగునీటి కూలర్లను బుధవారం ఏర్పాటు చేశారు. వేసవిని దష్టిలో పెట్టుకొని 41 రోజుల పాటు రోజూ ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు. ట్రాఫిక్ సిఐ నాగరాజు అభ్యర్థన మేరకు తాగునీటి అవసరాలకు కూలర్లనూ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆరవెల్లి ఫణికుమార్, కస్తూరి సంతోష్, సాయి, రాజేష్, గుప్త పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

బిసి భవనం పరిశీలన

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని వాంబే కాలనీ సమీపాన నిర్మాణంలో ఉన్న బిసి భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరిశీలించారు. ఈ భవనాన్ని ప్రారంభించేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించడంతో ఆయన స్వయంగా పరిశీలించారు. అత్యాధుకిన సౌకర్యాలతో ఈ భవాన్ని నిర్మించామని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా బిసి సంక్షేమాధికారి అనురాధ, బిసి కార్పోరేషన్ ఇడి గడ్డెమ్మ, టిడిపి నాయకులు మాదారపు వెంకటేస్, గుత్తు చిన్నారావు ఉన్నారు.


ఎన్‌ఆర్‌ఐలతో ఎమ్మెల్యేలు రవికుమార్, నారాయణరెడ్డి

ఎన్‌ఆర్‌ఐలతో ఎమ్మెల్యేలు

ఆమదాలవలస: అమెరికా దేశంలోని చార్లెట్ నగరంలో బుధవారం టిడిపి ఎన్ఆర్ఐ నాయకులు ఎమ్మెల్యేల మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని ఎన్నారైలు టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు వర్కింగ్ డే అయినప్పటికీ సుమారు 200 మంది చార్లేట్ ఎన్ఆర్ఐలు పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.


నారాయణతో ఎమ్మెల్యే శిరీష

ఆర్‌టిసి సేవలు మెరుగుపడాలి

పలాస : పలాస ఆర్‌టిసి సేవలు గ్రామీణ ప్రాంతాల్లో మెరుగుపడాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు విజయవాడలోని ఆర్‌టిసి చైర్మన్ కొనకాళ్ల నారాయణను బుధవారం కలిసి వివరించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యల పరిష్కారానికి విజ్ఞప్తి చేశారు. దూరప్రాంతాలకు పలాస కేంద్రంగా సర్వీసులు పెంచాలని, నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈమెతో పాటు ఆమె భర్త, నియోజకవర్గ సమన్వయకర్త పారిశ్రామిక వేత్త వెంకన్న చౌదరి ఉన్నారు.

రవికి ఆర్థికసాయం

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన చెల్లూరి రవి అనారోగ్యంతో శ్రీకాకుళం కిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు నిమిత్తం కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట గ్రామ సంఘం సభ్యులు బుధవారం రూ.32.100లు నగదును ఆస్పత్రికి వెళ్లి రవి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు అంగ గున్నయ్య, గేదేల వీరన్నస్వామి, చెల్లూరి బాలరాజు, జి.విజయకుమార్‌లు రవి కుటుంబసభ్యులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

తహశీల్దార్ నియామకంలో జాప్యం

టెక్కలి: తహశీల్దార్ కార్యాలయానికి తహశీల్దార్ నియామకంలో జాప్యం ఏర్పడుతుంది. గతంలో తహశీల్దార్‌గా విధులు నిర్వర్తించిన దిలీప్‌చక్రవర్తి ఉద్యోగోన్నతిపై బదిలీ కావడంతో ఆ స్థానం ఖాళీ ఏర్పడింది. సుమారు ఆరు నెలల నుంచి తహశీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో పలు అబివృద్ధి పనులకు ఆటంకంగా మారుతుంది. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రం కావడంతో ఇక్కడ తహశీల్దార్ బాధ్యతల నిర్వహణ కష్టతరంగా ఉంటుందని పలువురు భావిస్తున్నట్లు సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల తరువాత ఆ స్థానం భర్తీ అవుతుందని ఆశించారు. అయినా నియామకం చేపట్టలేదు.

మార్క్ శంకర్ కోలుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సింగపూర్ పాఠశాలలో సంభవించిన అగ్నిప్రమాదంలో గాయపడిన ఉప ముఖ్యమంత్రి కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని రాధాగోవిందస్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన మండల నాయకులు దుక్క బాలరాజు, చింతల ప్రశాంత్, మాణిక శ్రీను, పత్రి మణికంఠ, కూర్మాపు బాబురావు, మానిక రాకేష్, రాజనాల కేశవరావు, షేక్‌నాపల్లి, మణికంఠ పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ త్వరగా కోలుకోవాలని మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో జనసేన నాయకులు పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ విశ్వక్సేన్, జిల్లా కార్యదర్శి వడ్డాది శ్రీను, స్వప్న, రాధారాణి, మైలపల్లి రాంప్రసాద్, సువ్వాడ రామారావు, దన్నాన రవీంద్ర, రమణ, చిన్న, నాయుడు, సురేష్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి

కవిటి: అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి సూచించారు. కవిటి పంచాయతీ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలతో, ఆశ కార్యకర్తలతో చిన్నారుల ఆధార్ కార్డులపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆధార్ కార్డులు లేవని, కచ్చితంగా వారందరికీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒ జి.వీరభద్రస్వామి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కవిత, పద్మావతి, శారద పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వినియోగం వద్దు

టెక్కలి : మాదకద్రవ్యాలు వినియోగానికి దూరంగా ఉండాలని ఎస్.ఐ కె.రాము కోరారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యాన బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతుందన్నారు. ఈ విషయమై పవర్ పాయింట్ ప్రజెంటెషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, క్లబ్ కో-ఆర్డినేటర్ పి.వి.ఎన్.ఆచార్యులు, బి.ఝాన్సీరాణి, కసవయ్య, సుగుణాకరరావు పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న అబ్దుల్ సాధిక్

దర్గా వక్ఫ్ బోర్డు నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని లాలపేటలో హజరత్ యూసఫ్ షా టకీయా దర్గా వక్ఫ్ బోర్డు నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. వక్ బోర్డు ఇనస్పెక్టర్ అబ్దుల్ సాధిక్ ఆధ్వర్యాన నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా ఎం.డి.ఫరీదు ఉద్దీన్, వైస్ ప్రెసిడెంట్‌గా అబ్దుల్లా, కార్యదర్శిగా ఎస్.ఆలీ, కోశాధికారిగా తాజుద్దీన్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా ఆక్తర్‌ఖాన్, అలీమ్‌ఖాన్, ఇరా పాన్, జాకెర్, ఉస్మాన్ రఫిలను నియమించారు. నూతన కార్యవర్గం లాలపేట దర్గ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు.